రాజీతో ఇరుపక్షాలకు న్యాయం

కామారెడ్డి నేరవిభాగం, న్యూస్‌టుడే: రాజీ మార్గంతోనే ఇరు పక్షాలకు న్యాయం చేకూరుతుందని జిల్లా న్యాయమూర్తి డాక్టర్ సీహెచ్‌వీఆర్ఆర్ వరప్రసాద్ పేర్కొన్నారు. జిల్లా న్యాయస్థాన భవన సముదాయంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో పాల్గొని మాట్లాడారు. క్షణికావేశంలో చేసిన తప్పులను పరిష్కరించుకోవడానికి లోక్ అదాలత్ చక్కటి అవకాశం కల్పిస్తోందన్నారు. ఇరుపక్షాల సమ్మతితో రోజూ లోక్ అదాలత్ ద్వారా కేసులు పరిష్కరించడానికి అవకాశం ఉందన్నారు. కేసుల పరిష్కారానికి స్వచ్ఛందంగా ముందుకు రావాలని జిల్లా ఎస్పీ సింధూశర్మ పిలుపునిచ్చారు. జాతీయ లోక్ అదాలత్‌లో 7 బెంచీల ద్వారా కేసులు పరిష్కారం చేశారు. కక్షిదారులకు పులిహోర వడ్డించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు న్యాయమూర్తి లాల్‌సింగ్ శ్రీనివాస్‌నాయక్, సీనియర్ సివిల్ జడ్జి నాగరాణి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.సుధాకర్, మొబైల్ కోర్టు న్యాయమూర్తి బి.దీక్ష, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీకాంత్‌గౌడ్, పీపీలు కృష్ణవేణి, రాజగోపాల్‌గౌడ్, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

3031 కేసులు పరిష్కారం.. : జిల్లాలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో వివిధ రకాలైన 3031 కేసులు పరిష్కారమయ్యాయి. వీటిలో క్రిమినల్ కేసులు 2938 ఉండగా.. సివిల్ 28, ప్రిలిటిగేషన్ 49, ఎంవీవోపీ కేసులు 16 పరిష్కరించినట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధికారులు తెలిపారు. వివిధ కేసుల్లో పరిహారం కింది రూ. 1,84,19,528లు చెల్లించినట్లు పేర్కొన్నారు.


లోక్ అదాలత్‌లో జిల్లా జడ్జి డాక్టర్ సీహెచ్‌వీఆర్ఆర్ వరప్రసాద్, తదితరులు

పంచాయతీలకు రూ.6.53 కోట్లు

కామారెడ్డి కలెక్టరేట్: గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం స్టేట్ మ్యాచింగ్ గ్రాంట్ రూ. 6,53,68,802 నిధులను శనివారం మంజూరు చేసింది. ఇందులో ట్రాక్టర్ ఈఎంఐలకు రూ. 19,73,431, స్వచ్ఛదనం- పచ్చదనం కోసం రూ. 2,76,49,076, మల్టీపర్పస్ వర్కర్ల వేతనాల కోసం రూ. 1,99,52,295 నిధులు కేటాయించారు.

ముడుపులిస్తేనే.. అనుమతులు

జిల్లా కేంద్రంలో బహుళ అంతస్తుల నిర్మాణాలకు అడ్డంకులు



ఈనాడు, కామారెడ్డి

పట్టణీకరణలో భాగంగా జిల్లా కేంద్రంలో భవన నిర్మాణాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఇందుకు అనుగుణంగా భవన నిర్మాణ అనుమతులు సులభతరం, పారదర్శకం చేసేందుకు రాష్ట్ర పురపాలక శాఖ టీఎస్-బీపాస్ అమల్లోకి తెచ్చింది. బిల్డింగ్ పర్మిషన్ల జారీలో ఇరిగేషన్, పీఆర్, ఆర్అండ్‌బీలతో కూడిన డిస్ట్రిక్ట్ టాస్క్‌ఫోర్స్ (డీటీఎఫ్) కమిటీలను రంగంలోకి దించింది. అయినప్పటికీ జిల్లా కేంద్రంలో ఇటీవలి కాలంలో వసూళ్లు భారీగా పెరిగిన తీరుపై 'ఈనాడు' ప్రత్యేక కథనం.

పట్టణ ప్రణాళిక విభాగంలోని కొంత మంది అవినీతి అధికారులు, దళారుల అవతారమెత్తిన కొందరు పట్టణ ప్రజాప్రతినిధులు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. గతంలో పురపాలిక అనుమతులతో నిర్మాణం చేసుకున్న ఇంటిపై.. ప్రస్తుతం రెండు, మూడో అంతస్తుల నిర్మాణం చేసుకోవాలంటే అనుమతి ఇచ్చేందుకు నిబంధనల పేరుతో ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఇంటిని కూల్చేసి సెట్‌బ్యాక్ నిబంధనలు అమలు చేస్తేనే అనుమతిస్తామని తేల్చిచెబుతున్నారు. దీంతో నిర్మాణదారులు పట్టణ ప్రణాళిక విభాగానికి చెందిన యంత్రాంగంతోపాటు దళారులను కలిసి ఎంతో కొంత సమర్పించుకుంటేనే అనుమతులు లభించే పరిస్థితి.

నిబంధనల ప్రకారం

● అనుమతికి దరఖాస్తు చేసుకోగానే పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలన చేసి నిబంధనలకు అనుగుణంగా మొదటి దశలో నిర్మాణ అనుమతి రుసుం ఖరారు చేసి కమిషనర్‌కు నివేదించాల్సి ఉంటుంది. ● డీటీఎఫ్(డిస్ట్రిక్ట్ టాస్క్‌ఫోర్స్) కమిటీ నుంచి అభ్యంతరాలు లేకపోతే అనుమతి మంజూరు చేయాలి. ఇందుకు విరుద్ధంగా గతంలో నిర్మాణం చేసుకున్న సమయంలో సెట్‌బ్యాక్ లేదంటూ ప్రస్తుతం ఉన్న ఇంటిని కూల్చివేస్తేనే గ్రౌండ్‌ఫ్లోర్ నుంచి పైఅంతస్తుకు అనుమతి అంటూ కొర్రీలు పెడుతున్నారు. ● రూ.లక్షల వ్యయం చేసి నిర్మాణం చేసిన ఇంటిని కూల్చేందుకు సిద్ధంగా లేని యజమానులు అనుమతి కోసం దళారుల అవతారమెత్తిన స్థానిక ప్రజాప్రతినిధులతో పాటు పట్టణ ప్రణాళిక విభాగం యంత్రాంగానికి అనుసంధానంగా పని చేసే ప్రైవేటు ఇంజినీర్లను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదనుగా అనుమతుల పేరుతో ధరలు నిర్ణయించి వసూళ్లకు పాల్పడుతున్నారు.

మచ్చుకు కొన్ని..

● ఓ ఉద్యోగి రెండేళ్ల క్రితం అశోక్‌నగర్‌లోని తన ప్లాట్‌లో పురపాలిక అనుమతులతో ఇల్లు నిర్మించుకున్నారు. ఆర్థిక పరిస్థితి మెరుగవ్వడంతో జీ ప్లస్ వన్, జీ ప్లస్ టూ నిర్మాణాల నిమిత్తం అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్నారు. క్షేత్రస్థాయి పరిశీలనకు వచ్చిన పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు సెట్‌బ్యాక్ లేదంటూ పైఅంతస్తుకు అనుమతి నిరాకరించారు. ఇంటిని కూల్చేస్తే జీ ప్లస్ వన్, జీ ప్లస్ టూలకు అనుమతి ఇస్తామని వెల్లడించడంతో కంగుతిన్నారు. అనంతరం యజమాని దళారిని ఆశ్రయిస్తే నగదు తీసుకుని అనుమతి మంజూరు చేశారు.

● జిల్లా కేంద్రం శివారులోని దేవునిపల్లి పురపాలికలో విలీనం కాకముందు పంచాయతీ అనుమతులతో సెట్‌బ్యాక్ నిబంధనలకు అనుగుణంగా ఓ వ్యాపారి ఇంటి నిర్మాణం చేసుకున్నారు. ఇటీవల పైఅంతస్తు నిర్మాణం చేసుకునేందుకు అనుమతి కోసం టీఎస్-బీపాస్‌లో అర్జీ పెట్టుకున్నారు. పంచాయతీ నిబంధనలకు అనుగుణంగా నిర్మాణం చేసుకున్న ఇంటికి పైఅంతస్తుకు అనుమతి సాధ్యం కాదని తేల్చారు. దళారిని ఆశ్రయిస్తే నగదు తీసుకొని అనుమతులు మంజూరు చేశారు. ఇలా నగదు సమర్పిస్తేనే అడుగు ముందుకు పడే పరిస్థితి నెలకొంటోందని బాధితులు వాపోతున్నారు. 'నిబంధనలకు అనుగుణంగానే అనుమతులు మంజూరు చేస్తున్నాం. వసూళ్లు చేస్తున్నారనేది తప్పుడు ఆరోపణలు. సిబ్బంది ఎవరైనా వసూళ్లు చేసినట్లు నిర్మాణదారులు రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే ఉన్నతాధికారులకు నివేదించి వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని' పట్టణ ప్రణాళిక విభాగం అధికారి గిరిధర్ 'ఈనాడు'తో పేర్కొన్నారు.

యథేచ్ఛగా లింగ నిర్ధారణ

ఈనాడు కామారెడ్డి, న్యూస్‌టుడే, కామారెడ్డి వైద్యవిభాగం

తాజాగా మహారాష్ట్ర పోలీసుల రాకతో వెలుగులోకి ఘటన

కాసులకు కక్కుర్తి పడి జిల్లాలోని కొందరు వైద్యులు యథేచ్ఛగా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. గర్భంలో ఉన్నది ఆడ, మగ అని నిర్ధారిస్తూ.. ఆడ శిశువు అయితే పురిట్లోనే కడతేరుస్తున్నారు. తాజాగా లింగ నిర్ధారణ కేసులో జిల్లా కేంద్రానికి చెందిన ఓ వైద్యుడిని మహారాష్ట్ర పోలీసులు అదుపులోకి తీసుకోవడం కలకలం రేపింది. మహారాష్ట్రకు చెందిన ఓ గర్భిణికి పరీక్షలు చేసి ఆడపిల్ల అని తేల్చడంతో ఆమె అక్కడి ఓ ప్రైవేటు ఆసుపత్రిలో అబార్షన్ చేయించుకుంది. ఈ విషయం బయటకు రావడంతో మహారాష్ట్ర పోలీసులు శుక్రవారం జిల్లా కేంద్రానికి వచ్చి లింగ నిర్ధారణ చేసిన వైద్యుడిని లాథూర్‌కు తీసుకెళ్లారు.

మారని తీరు..

ప్రభుత్వ వైద్యుడిగా ఉన్న సదరు వ్యక్తిపై గతంలోనే లింగ నిర్ధారణలో పలు కేసులు నమోదయ్యాయి. ఈ విషయం తెలిసి మూడు నెలల క్రితమే ఆ ఆసుపత్రిని వైద్యశాఖ అధికారులు జప్తు చేశారు. తిరిగి కోర్టు నుంచి స్టే తెచ్చుకొని ఆసుపత్రి తెరిచి వైద్యం చేయడం ప్రారంభించారు. తన తీరు మార్చుకోకుండా సదరు వైద్యుడే ప్రస్తుతం మళ్లీ లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

ఇతర ప్రాంతాల నుంచి రాక..

జిల్లా కేంద్రానికి నిజామాబాద్, కరీంనగర్, హైదరాబాద్‌తో పాటు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల నుంచి గర్భిణులు వస్తున్నారు. కిందిస్థాయిలోని వైద్యులు, ఆర్ఎంపీ, పీఎంపీల సాయంతో స్కానింగ్ కేంద్రాలకు వస్తున్నట్లు సమాచారం. తాజాగా మహారాష్ట్రకు చెందిన ఓ గర్భిణి ఇక్కడికి వచ్చి పరీక్షలు చేయించుకోగా.. గర్భంలో ఆడ శిశువు ఉన్నట్లు వైద్యుడు వెల్లడించారు. దీంతో ఆమె సొంతూరికి వెళ్లి అబార్షన్ చేయించుకోవడంతో విషయం వెలుగుచూసింది. ఇలా ఇతర ప్రాంతాల నుంచి అనేక మంది ఇక్కడికి వచ్చి లింగ నిర్ధారణ చేయించుకున్నట్లు స్పష్టమవుతోంది.

వివరాలు ఆరా తీస్తున్నాం..

- చంద్రశేఖర్, డీఎంహెచ్‌వో



జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఆసుపత్రిలో లింగ నిర్ధారణ ఘటనపై వివరాలు ఆరా తీస్తున్నాం. గతంలోనూ ఇదే కేసులో ఆసుపత్రిని జప్తు చేయగా.. హైకోర్టు నుంచి స్టే తెచ్చుకున్నారు. ప్రస్తుతం మహారాష్ట్ర పోలీసులు ఇక్కడికి వచ్చి వైద్యుడిని అదుపులోకి తీసుకున్న విషయం తెలిసింది. లింగ నిర్ధారణ ఎప్పుడు చేశారో సమగ్ర వివరాలు తెలుసుకుంటున్నాం.

విద్యా రంగానికి పెద్దపీట

పిట్లం, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పాలనలో విద్యారంగానికి పెద్దపీట వేస్తున్నట్లు ఎంపీ సురేశ్ షెట్కార్, ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు పేర్కొన్నారు. పిట్లం మండల కేంద్రంలోని కేజీబీవీలో సమగ్ర శిక్షా ఏడబ్ల్యూపీఅండ్‌బీ నిధులు రూ.2.30 కోట్లతో చేపట్టనున్న పనులకు శనివారం వారు శంకుస్థాపన చేసి మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు జంబిగ హన్మాండ్లు, విద్యాలయ ప్రత్యేకాధికారిణి సరిత తదితరులు పాల్గొన్నారు.


తరగతి గదుల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ షెట్కార్, ఎమ్మెల్యే లక్ష్మీ కాంతరావు

పల్లె ఓటర్లు 6,36,362 మంది

తుది జాబితా విడుదల

న్యూస్‌టుడే, కామారెడ్డి కలెక్టరేట్ : జిల్లాలో పల్లె ఓటర్ల తుది జాబితా వచ్చేసింది. మొత్తంగా 6,36,362 మంది ఉన్నారు. ఈ నెల 13వ తేదీన విడుదల చేసిన ముసాయిదా ఓటర్ల జాబితా కంటే తుది జాబితాలో 62 మంది పెరగడం గమనార్హం. ముసాయిదా జాబితా విడుదల అనంతరం జిల్లా, మండల స్థాయిలో ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్నారు. ముసాయిదా జాబితాపై ఈనెల 21వ తేదీ వరకు అభ్యంతరాలకు అవకాశం ఇవ్వగా.. 2100 వరకు వచ్చాయి. వాటిని ఈనెల 26వ తేదీ వరకు పరిష్కరించి తుది జాబితా విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. మొత్తం ఓటర్లలో 51.82 శాతం వీరే ఉండగా.. 48.17 శాతం పురుష ఓటర్లు ఉన్నారు.

పెంపుడు కుక్కలకు టీకాలు తప్పనిసరి

కామారెడ్డి కలెక్టరేట్ : రేబిస్ వ్యాధిపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో శనివారం ప్రపంచ రేబిస్ నియంత్రణ దినోత్సవం సందర్భంగా పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కుక్కకాటుకు గురికాకుండా జాగ్రత్తగా ఉండాలని కోరారు. కుక్కకాటుకు గురైతే వెంటనే వైద్యుడిని సంప్రదించి చికిత్స తీసుకోవాలని సూచించారు. పెంపుడు కుక్కలకు తప్పకుండా టీకాలు వేయించాలని కోరారు. అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, పశు సంవర్ధకశాఖ అధికారి సురేందర్, సీపీవో రాజారాం, డీపీవో శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

సానుకూల దృక్పథం.. హృదయం పదిలం


ప్రపంచ గుండె దినోత్సవం నేడు

'ఒత్తిడి' ఇప్పుడు అందరి నోటా వినిపిస్తున్న మాట. డిజిటల్ యుగంలో జీవన శైలి మార్పుతో మనిషి ఒత్తిడికి గురవుతున్నాడన్నది ఒప్పుకోవాల్సిందే. అయితే అడపాదడపా ఒత్తిడితో సంభవిస్తున్న మరణాలు చర్చనీయాంశంగా మారుతున్నాయి. అలాంటి మరణాల్లో ఎక్కువ గుండెపోటు బాధితులేనని చెబుతారు. ఇలా చర్చకు తావిస్తున్న ఒత్తిడిని చిత్తుగా ఓడించే శక్తి మనిషికే ఉంటుంది. మనిషి సానుకూల దృక్పథం అలవాటు చేసుకుంటే ఒత్తిడి ఓడిపోవడం ఖాయం. ఫలితంగా గుప్పెడు గుండెను పదిలంగా పెట్టుకోవచ్చు. ప్రపంచ గుండె దినోత్సవాన్ని పురస్కరించుకుని ఒత్తిడి గురించి తెలుసుకుందాం.

న్యూస్‌టుడే, ఇందూరు ఫీచర్స్

జిల్లాలో..

జిల్లాలో ఒత్తిడితో ముడిపడిన అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నవారున్నారు. జిల్లా నుంచి టెక్ రంగంలో ఉద్యోగాలు చేసే వారి సంఖ్య ఎక్కువే. ఉద్యోగులు, ఉపాధి కోసం గల్ఫ్‌కు వెళ్లిన వారు, ప్రముఖ సంస్థల్లో ప్రవేశాల కోసం విద్యార్థులు.. ఒత్తిడి బారిన పడుతున్నారనే వాదన ఉంది. ఒత్తిడికి గురైతే కుంగుబాటు బారిన పడతారు. అది తీవ్రమైతే ప్రాణాపాయానికి దారి తీస్తుంది. కడుపులో అల్సర్లు, తలనొప్పి, గుండెపోటు, రక్తపోటు, మధుమేహం, చర్మవ్యాధులు, ఆస్తమా, ఒళ్లునొప్పులు, హార్మోన్ల అసమతుల్యం వంటి రుగ్మతలు వేధిస్తాయి. ఈ రుగ్మతలకు ముందు చెమటలు పట్టడం, ఆకలి మందగించడం, లేదా అధికంగా తినడం, గుండె వేగంగా కొట్టుకోవడం, నిద్రలేమి, కండరాల నొప్పి వంటి లక్షణాలు ఉంటాయి.




ఇలా చేస్తే మేలు..

వారాంతాల్లో ఫోన్లను దూరం పెట్టి పిల్లలు, కుటుంబ సభ్యులతో సరదాగా గడపాలి. ★ ఇష్టమైన క్రీడలు ఆడాలి. ★ ఏ వయసులో ఉన్నా బాల్యంలోకి ప్రవేశించాలి. ★ మధురమైన జ్ఞాపకాలు నెమరువేసుకోవాలి. ★ పనిని బాధ్యతగా భావించాలి.. భారంగా భావిస్తే ముప్పు. ★ ప్రకృతి ధర్మాన్ని పరిశీలిస్తుండాలి. ★ వారానికి నాలురోజులైనా వ్యాయామం చేయాలి. ★ శరీరాన్ని చెమట పట్టిస్తే ఒత్తిడి హార్మోన్లు పనిచేసే తీవ్రత తగ్గుతుంది.

యోగాతో ప్రయోజనం

యోగాతో ఒత్తిడిని జయించే వీలుంది. ఒత్తిడి, మానసిక స్థాయిని బట్టి గురువుల శిక్షణలో సాధన చేస్తే ప్రయోజనముంటుంది. దీర్ఘకాలిక సాధన అవసరం. ఒంటి నుంచి చెమటను బయటకు పంపే శారీరక శ్రమ తప్పనిసరి. సమతుల ఆహారం తీసుకోవడమూ ముఖ్యమే.



- సాయిలు, యోగా థెరపిస్టు

రెండు జిల్లాల్లో వివరాలు ఇలా...

వ్యాధి	నిజామాబాద్	కామారెడ్డి
రక్తపోటు	75,068	68,752
మధుమేహం	34,476	44,654

☛ నిజామాబాద్ జనాభాలో మధుమేహం 2 శాతం, రక్తపోటు 4.5 శాతం ఉండగా.. కామారెడ్డిలో మధుమేహం 4.4 శాతం, రక్తపోటు 6.8 శాతం ఉంటుందని అంచనా.

☛ దేశంలో సంభవించే మరణాల్లో 27 శాతం హృద్రోగ సమస్యలేనని అధ్యయనాలు చెబుతున్నాయి.

☛ 30-40 ఏళ్ల మధ్య వయస్కుల్లో గుండెపోటు ప్రమాదం పెరిగిందని చెబుతున్నారు.

4న సెర్చ్ కమిటీ సమావేశం

న్యూస్‌టుడే, తెవివి క్యాంపస్ : రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలకు ఉపకులపతులను నియమించేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ఇందుకోసం సెర్చ్ కమిటీ(అన్వేషణ)ల సమావేశాలు అక్టోబరు 3, 4 తేదీల్లో సచివాలయంలో నిర్వహించనుంది. తెలంగాణ విశ్వవిద్యాలయ సెర్చ్ కమిటీ సమావేశం 4వ తేదీన మధ్యాహ్నం జరగనున్నట్లు వర్సిటీ అధికారులు శనివారం ధ్రువీకరించారు. మే నెలలోనే ముగ్గురు సభ్యులతో సెర్చ్ కమిటీ ఏర్పాటుచేయగా.. తెవివి నామినీగా ఓయూ విశ్రాంత ఆచార్యుడు సులేమాన్ సిద్దిఖీ, యూజీసీకి ఆచార్య రాజేశ్వర్‌సింగ్ ఛండేల్, ప్రభుత్వ నామినీగా సీఎస్ శాంతికుమారి ఉన్నారు.

పడని ముందడుగు.. : లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ముగియడంతో ఉపకులపతుల నియామకాల ప్రక్రియకు కేంద్ర ఎన్నికల కమిషన్(ఈసీ) అనుమతి ఇచ్చింది. దీంతో సెర్చ్ కమిటీలను నియమిస్తూ ప్రభుత్వం మే 15వ తేదీన ఉత్తర్వులు జారీ చేసింది. అభ్యర్థుల దరఖాస్తులను సెర్చ్ కమిటీలు పరిశీలించి ఒక్కో వర్సిటీకి ముగ్గురు ఆచార్యుల చొప్పున ఎంపిక చేసి గవర్నర్ ఆమోదం కోసం రాష్ట్ర ప్రభుత్వం పంపిస్తుంది. గవర్నర్ ఆమోదం తర్వాత ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులిస్తుంది. మే 21న వీసీల పదవీకాలం ముగియడానికి ముందే కొత్త వీసీల నియామకానికి దరఖాస్తులు స్వీకరించింది. మే నెలాఖరులోపు నూతన వీసీలకు నియామక ఉత్తర్వులు జారీ చేస్తామని అప్పట్లో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం ప్రకటించారు. కానీ సెర్చ్ కమిటీల సమావేశాల నిర్వహణకు ముందడుగు పడలేదు.

జాతీయ లోక్ అదాలత్‌లో 49 ఏళ్ల కేసు పరిష్కారం

కామారెడ్డి నేరవిభాగం, న్యూస్‌టుడే: ఒకటి, రెండేళ్లు కాదు.. ఏకంగా 49 ఏళ్ల కేసు శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కారమైంది. 1975 సంవత్సరంలో సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డిలో 4.02 ఎకరాల భూమికి సంబంధించి ఇరు వర్గాలకు చెందిన 15 మంది మధ్య వివాదం తలెత్తింది. పలుమార్లు వాయిదాలు పడుతూ రాగా.. సీనియర్ సివిల్ జడ్జి టి.నాగరాణి నేతృత్వంలో సీనియర్ న్యాయవాదులు జీడిపల్లి రామచంద్రారెడ్డి, మాణిక్‌రావుల సహకారంతో రూ.6 లక్షల పరిహారం చెల్లింపుతో ఇరువర్గాలు రాజీ కుదుర్చుకోవడంతో ఈ కేసు ముగిసింది.

వనితా... ఘనత

ఈ అతివలు అందరిలా కాదు. తాము ఎంచుకున్న వృత్తిలో భిన్నంగా పనిచేసి పేరు తెచ్చుకున్నారు. పనిలో ఎదురయ్యే సవాళ్లను పరిష్కరించుకుంటూ ముందుకు సాగారు. అప్పగించిన బాధ్యతలు నిబద్ధతతో నిర్వర్తించి ప్రశంసలు అందుకున్నారు. ఒకరు పోలీసు శాఖలో రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిస్తే.. మరొకరు తొలిసారి ఎస్‌జీఎఫ్ మహిళా కార్యదర్శి కాగా.. ఇంకొకరు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ పీడీ పురస్కారం అందుకున్నారు.

'అ'ద్వితీయం'


డీజీపీ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న రజనీ

నిజామాబాద్ నేరవిభాగం, న్యూస్‌టుడే: పోలీసు వృత్తి ఆషామాషీ కాదు. అందులో మహిళ ఉద్యోగం చేయడం మరింత సవాలు. జిల్లా కేంద్రానికి చెందిన రజనీ 2018లో కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. నాటి నుంచి నిజామాబాద్ ఒకటో ఠాణాలో విధులు నిర్వర్తిస్తున్నారు. తనకు అప్పగించిన బాధ్యతలు పక్కాగా నిర్వర్తిస్తూ మన్ననలు పొందుతున్నారు. ఇటీవల ఉద్యోగులకు రాష్ట్ర పోలీసు శాఖ పోటీలు నిర్వహించింది. ఠాణాల్లో ఫిర్యాదులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపరచడం, బాధితులతో మర్యాదగా మాట్లాడటం అంశంలో రాష్ట్రంలో ద్వితీయ స్థానంలో నిలిచి డీజీపీ నుంచి ప్రశంసా పత్రం అందుకున్నారు. ఒకటో ఠాణా పరిధిలో జులై, ఆగస్టులో 400 కేసుల వివరాలు పోర్టల్‌లో పొందుపరిచారు. సంబంధిత కేసుల సమాచారం నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

రాష్ట్రంలో ఉత్తమ పీడీ



ఇందూర్ సిటీ, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రం గిరిరాజ్ ప్రభుత్వ కళాశాలలో 2015లో పీడీగా విధుల్లో చేరిన బాలమణి ఈ నెల 5న రాష్ట్రస్థాయి ఉత్తమ పీడీగా ఎంపికయ్యారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించేందుకు కృషి చేస్తున్నారు. ఇప్పటి వరకు ఆమె సారథ్యంలో 250 మంది క్రీడాకారులు జాతీయ స్థాయి టోర్నీల్లో పాల్గొని పతకాలు సాధించారు. ఎన్‌సీసీ అధికారిగా ఎంతో మంది కేడెట్లను తయారు చేశారు. దిల్లీలో నిర్వహించిన 11 గణతంత్ర పరేడ్‌లకు, 10 తల్ సైనిక్, ఎన్‌సీసీ శిబిరాలకు విద్యార్థులను సిద్ధం చేశారు. ఇటీవల సింగపూర్‌లో నిర్వహించిన యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాంలోనూ ఓ విద్యార్థిని పాల్గొన్నారు.

తొలి మహిళా కార్యదర్శి



నిజామాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: ఆటల్లో పురుష వ్యాయామ ఉపాధ్యాయులదే ఆధిపత్యం. మహిళా పీఈటీలు తక్కువగా ఉంటారు. అలాంటిది నిజామాబాద్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్)కు ఓ మహిళ కార్యదర్శి ఎంపిక కావడం ఇదే తొలిసారి. నాగమణిది మెండోర మండలం పోచంపాడ్. ఆమె కబడ్డీలో జాతీయ క్రీడాకారిణి. 1987లో వ్యాయామ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు. ఎక్కడ పనిచేసినా విద్యార్థులను ఆటల్లో మెరికలుగా మారుస్తున్నారు. ఎస్‌జీఎఫ్ కార్యదర్శి పదవికి ఎంతో పోటీ ఉన్నా ఆమెకు అవకాశం దక్కింది. ఈ ఏడాది విద్యాశాఖ ఆధ్వర్యంలో పాఠశాల, మండల, జిల్లా స్థాయిలో ఆటల పోటీలు నిర్వహించడం వీరి బాధ్యత. పీఈటీలను సమన్వయం చేసుకొని విజయవంతం చేసేందుకు కృషి చేస్తానని ఆమె చెబుతున్నారు.

1న ధ్రువపత్రాల పరిశీలన

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: డీఈఐఈడీ, డీపీఎస్‌సీలో ప్రవేశాలకు ధ్రువపత్రాల పరిశీలనకు మరో అవకాశం కల్పిస్తున్నామని డైట్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఏ కేంద్రంలో హాజరుకావాలో http:///deecet.cdse.telangana.gov.in వెబ్‌సైట్‌లో తెలుసుకోవచ్చన్నారు. వివరాలకు సంబంధిత బాధ్యుడు నాగరాజును 91774 21285 నంబరులో సంప్రదించాలని కోరారు.



గ్రంథాలయం.. కిటకిట

రానున్న కాలంలో వరుసగా ప్రభుత్వ ఉద్యోగ పరీక్షలు ఉండటంతో బాన్సువాడ జయశంకర్ మినీస్టేడియంలోని గ్రంథాలయం ఉద్యోగార్థులతో కిటకిటలాడుతుంది. అక్టోబరులో గ్రూప్ 1 మెయిన్స్, నవంబర్‌లో గ్రూప్ 3, డిసెంబరులో గ్రూప్-2తో పాటు జాబ్‌క్యాలెండర్ ప్రకారం పలు ఉద్యోగ ప్రకటనలు వెలువడనుండటంతో రోజు రోజుకూ రద్దీ పెరుగుతోంది. ఉదయం త్వరగా వస్తేనే సీటు దొరికే పరిస్థితి ఉంది. దీంతో అభ్యర్థులు ఉదయం 8 గంటలకే అక్కడికి చేరుకుంటున్నారు. సంఖ్య పెరిగిపోవడంతో స్టేడియంలో మరో గదిని సైతం కేటాయించినట్లు గ్రంథపాలకుడు సుధాకర్ 'న్యూస్‌టుడే'తో పేర్కొన్నారు.

– న్యూస్‌టుడే, బాన్సువాడ పట్టణం

ఆకాశమే హద్దుగా పర్యాటకుల కోలాహలం

రామోజీ ఫిల్మ్‌సిటీలో సందడే సందడి

రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే: పండగల వేళ పర్యాటకుల రాకతో రామోజీ ఫిల్మ్‌సిటీ సందడిగా మారింది. దసరా, దీపావళి పండగలను పురస్కరించుకుని ఈ నెల 26న ప్రారంభమైన వేడుకల్లో నిత్యం ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఫిల్మ్‌సిటీ సందర్శనకు వచ్చి మ్యూజికల్ గ్లో గార్డెన్ అందాలను వీక్షిస్తూ ముగ్ధులవుతున్నారు. ఫిల్మీ స్ట్రీట్ విశేషాలు ఆబాలగోపాలాన్ని ఆకట్టుకుంటున్నాయి. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు వేడుకల్లో పాలుపంచుకుంటూ చిన్నా, పెద్ద ఉల్లాసంగా గడుపుతున్నారు.





సరదాసరదా కార్యక్రమాలు, వినోదం పంచే ఏర్పాట్లు ప్రతి ఒక్కరినీ ఆనందతీరాలకు చేర్చుతున్నాయి. లైవ్ షోలు మధురానుభూతిని పంచుతున్నాయి. సాయంత్రం వేళల్లో సంతోషాలను ఆస్వాదించాలనుకునే పర్యాటకులు మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి వచ్చి ఆనందిస్తున్నారు. రామోజీ ఫిల్మ్‌సిటీని సరికొత్త విద్యుద్దీప కాంతుల్లో కళ్లారా వీక్షించి మధుర జ్ఞాపకాలను పదిలం చేసుకుంటున్నారు. స్టూడియో టూర్‌తో ఫిల్మ్‌సిటీని చుట్టేస్తూ సినీజగత్తులో విహారాన్ని ఆస్వాదిస్తున్నారు. రాజసం ఉట్టిపడేలా సాగే కార్నివాల్ పరేడ్, సంభ్రమాశ్చర్యాలను కళ్లముందుకు తెచ్చే మోషన్ క్యాప్చర్, వర్చువల్ షూట్ ఇలా.. అనుక్షణం ఆనంద వీక్షణాలతో పండగల వేళ చిన్నాపెద్దా ఆనందిస్తున్నారు. ఇంకెందుకు ఆలస్యం.. మీరూ రామోజీ ఫిల్మ్‌సిటీ సంబరాల్లో పాలుపంచుకోవచ్చు పదండి.



రవాణా సౌకర్యం.. రామోజీ ఫిల్మ్‌సిటీలో పండగ సంబరాలకు విచ్చేసే పర్యాటకులకు హైదరాబాద్ నగరంలోని వివిధ ఎంపిక చేసిన ప్రాంతాల నుంచి పికప్, డ్రాపింగ్ సౌకర్యం కల్పిస్తున్నారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా వేడుకలను ఆస్వాదించేందుకు వచ్చే వారికి ఇది ఎంతగానో దోహదపడుతుంది.

మరిన్ని వివరాలకు..
www.ramojifilmcity.com ఫోన్ నంబర్ 76598 76598ను సంప్రదించవచ్చు.

దవాఖానాలో తాత్కాలిక షెడ్డు నిర్మాణం

బాన్సువాడ, న్యూస్‌టుడే : రోగులకు ఇబ్బందులు లేకుండా ఉండాలని మాతాశిశు సంరక్షణ ఆసుపత్రిలో తాత్కాలికంగా షెడ్డు నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన ఆగ్రోస్ రాష్ట్ర ఛైర్మన్ కాసుల బాల్‌రాజ్‌తో కలిసి ఆసుపత్రిని సందర్శించారు. 100 పడకల ప్రాంతీయ ఆసుపత్రి భవనం నిర్మాణంలో ఉండటంతో మాతాశిశు సంరక్షణ ఆసుపత్రిలో స్థల సమస్య ఉందని నాయకులు ఆయనకు వివరించారు. భవన నిర్మాణం అయ్యే వరకు రోగులకు వసతులు కల్పించడానికి షెడ్డు కోసం స్థలాన్ని పరిశీలించారు. త్వరగా పనులు చేపట్టాలని సూచించారు. డీసీహెచ్‌ఎస్ విజయలక్ష్మి, నాయకులు గంగాధర్, కృష్ణారెడ్డి, సురేష్, ఎజాస్, అంజిరెడ్డి, ఖాలెక్, రవీందర్ పాల్గొన్నారు.


మాతాశిశు సంరక్షణ ఆసుపత్రిలో స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పోచారం

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

మోపాల్, న్యూస్‌టుడే: క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని, ప్రతి క్రీడాకారుడు విజయం కోసం ప్రయత్నించాలని ఎమ్మెల్యే భూపతిరెడ్డి సూచించారు. శనివారం మంచిప్ప జడ్పీహెచ్‌ఎస్‌లో ఎస్‌జీఎఫ్(స్కూల్ గేమ్స్ ఫెడరేషన్)ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లాల పోటీలను ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

యువత రక్తదానానికి ముందుకు రావాలి

కామారెడ్డి కలెక్టరేట్, న్యూస్‌టుడే: రక్తదానం చేయడానికి యువత ముందుకు రావాలని పాలనాధికారి ఆశిష్ సాంగ్వాన్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో శనివారం గ్రామీణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. రక్తదానంతో నిండు ప్రాణాలను రక్షించవచ్చని పేర్కొన్నారు. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో 35 మంది రక్తదానం చేశారు. అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, సీపీవో రాజారాం, డీపీవో శ్రీనివాస్‌రావు, రెడ్‌క్రాస్ ప్రతినిధులు పాల్గొన్నారు.


శిబిరంలో పాలనాధికారి ఆశిష్ సాంగ్వాన్ తదితరులు

సమాజాభివృద్ధిలో అధ్యాపకులు కీలకం

భిక్కనూరు, న్యూస్‌టుడే: విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంతో పాటు సమాజాభివృద్ధిలో అధ్యాపకులు కీలక పాత్ర పోషించాలని తెవివి రిజిస్ట్రార్ ఆచార్య యాదగిరి అన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికతను ఉపయోగించుకుని బోధన చేయాలని సూచించారు. ఇటీవల రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకుడిగా అవార్డు అందుకున్న దక్షిణ ప్రాంగణం ప్రిన్సిపల్ డా.సుధాకర్‌గౌడ్‌ను శనివారం కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘం సన్మానించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రిజిస్ట్రార్ హాజరయ్యారు. అవార్డుతో తనపై మరింత బాధ్యత పెరిగిందని విశ్వవిద్యాలయం అభివృద్ధికి సమష్టి కృషితో ముందుకు సాగుతామని డా.సుధాకర్‌గౌడ్ అన్నారు. వైస్ ప్రిన్సిపల్ డా.రాజేశ్వరి, అధ్యాపకులు మోహన్‌బాబు, డా.ప్రతిజ్ఞ, డా.నారాయణ, డా.యాలాద్రి, డా.సునిత, డా.సరిత, వైశాలి, విద్యార్థులు పాల్గొన్నారు.


ప్రిన్సిపల్ డా.సుధాకర్‌గౌడ్‌ను సన్మానిస్తున్న తెవివి దక్షిణ ప్రాంగణం అధ్యాపకులు

అసైన్డ్ భూములకు సహకార రుణాలు

డిచ్‌పల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగానికి అండగా ఉంటుందని. ఇకనుంచి అసైన్‌మెంట్ భూములున్న రైతులకు సహకార సంఘాల ద్వారా రుణాలు ఇవ్వనున్నట్లు ఐడీసీఎంఎస్ ఛైర్మన్ తారాచంద్‌నాయక్ తెలిపారు. శనివారం డిచ్‌పల్లి మండలం రాంపూర్‌లో సొసైటీ మహాజన సభను ఆయన అధ్యక్షతన నిర్వహించారు. గతంలో ఎన్నడూ ఇవ్వని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని. . వీటికి సంబంధించిన ఉత్తర్వులు డీసీసీబీ నుంచి వచ్చాయని చెప్పారు. ప్రస్తుతం రుణమాఫీ పొందినవారితోపాటు, కొత్త రైతులకు ఎకరానికి రూ.30 వేల రుణం ఇస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం సంఘ సభ్యత్వం కోసం వచ్చిన దరఖాస్తుల పరిశీలనకు సభ ఏకగ్రీవంగా ఆమోదించారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.


జిల్లాస్థాయిలో ఎంపికైన ఖోఖో క్రీడాకారులు

ఖోఖో ఎంపికలు పూర్తి

కామారెడ్డి క్రీడావిభాగం, న్యూస్‌టుడే: కామారెడ్డి బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో జిల్లాస్థాయి ఖోఖో ఎంపికలు శనివారం పూర్తయ్యాయి. అండర్ 17, 14 విభాగాల్లో బాలబాలికలకు ఏర్పాటు చేసిన ఈ టోర్నీలో 32 జట్లు పాల్గొన్నాయి. అండర్-17 బాలుర విభాగంలో ప్రథమ స్థానాన్ని మద్నూర్ జోన్ జట్టు, ద్వితీయ స్థానాన్ని ఎల్లారెడ్డి జోన్ జట్టు దక్కించుకున్నాయి. బాలికల విభాగంలో ప్రథమ స్థానాన్ని పిట్లం జోన్, ద్వితీయ స్థానాన్ని సదాశివనగర్ జోన్‌లు గెలుచుకున్నాయి. అండర్-14 బాలుర విభాగంలో ప్రథమ స్థానాన్ని ఎల్లారెడ్డి జోన్, ద్వితీయస్థానం పిట్లం జోన్‌లు దక్కించుకున్నాయి. బాలికల విభాగంలో ప్రథమస్థానం సదాశివనగర్, ద్వితీయ స్థానాన్ని కామారెడ్డి జోన్‌లు గెలుపొందాయి. కార్యక్రమంలో డీఈవో రాజు, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి హీరాలాల్, జీహెచ్‌ఎం నరహరిరాజు, స్వామిగౌడ్, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

అక్టోబరు 1న జిల్లాస్థాయి కబడ్డీ ఎంపికలు

కామారెడ్డి క్రీడావిభాగం, న్యూస్‌టుడే: జిల్లాస్థాయి కబడ్డీ ఎంపికలను అక్టోబరు 1న నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి హీరాలాల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మాచారెడ్డి మండలం సోమార్‌పేట ఉన్నత పాఠశాల ఆవరణలో ఎంపికలు ఉంటాయని తెలిపారు.

ఆందోళన వద్దు.. న్యాయం చేస్తాం

తాడ్వాయి, న్యూస్‌టుడే: మండలంలోని చిట్యాలలో పాతికేళ్ల క్రితం ప్రభుత్వం అందజేసిన ఇళ్ల స్థలాలపై వివాదం రాజుకుంది. 1998, 2000 సంవత్సరంలో గ్రామ శివారులోని సర్వే నంబర్ 156, 181లో 60 మంది ఎస్సీలకు, 80 మంది బీసీలకు ఇళ్ల స్థలాలు కేటాయించారు. కానీ, పట్టాలు ఇవ్వలేదు. 'మేము ముందు... మీరు వెనుక భాగం' అంటూ ఇరు వర్గాలు శనివారం గొడవకు దిగాయి. గతేడాది సైతం ఈస్థలాల విషయంలో ఇరువర్గాలు జిల్లా పాలనాధికారికి ఫిర్యాదు చేశాయి. ఇటీవల కొంత మంది అదే స్థలంలో గుడిసెలు వేసుకుని నివసించే ప్రయత్నం చేయడంతో గొడవ మళ్లీ మొదటికి వచ్చింది. విషయం తెలుసుకున్న తహసీల్దార్ రహీమొద్దీన్, ఎస్సై వెంకటేశ్వర్లు ఘటనా స్థలికి చేరుకుని ఆందోళనకారులతో చర్చించారు. అధికారులు జోక్యం చేసుకుని ఆ స్థలాలు రద్దు చేస్తామని, ఉన్నతాధికారుల ఆదేశాలతో తిరిగి అర్హులైన వారికి కేటాయిస్తామని పేర్కొన్నారు. అప్పుడు ఎవరి స్థలంలో వారు ఇళ్లు నిర్మించుకోవచ్చని సూచించారు. ఆందోళన చేయొద్దని, న్యాయం చేస్తామని చెప్పారు.


తమకు కేటాయించిన స్థలం ఎక్కడుందో చూపాలంటూ పట్టాలు చూపిస్తున్న లబ్ధిదారులు

మేనకోడలిని చూసేందుకు వెళ్తూ.. మృత్యు ఒడికి

జుక్కల్, న్యూస్‌టుడే: అనారోగ్యంతో బాధపడుతున్న తన మేనకోడలిని ఆసుపత్రికి తీసుకెళ్దామని వెళ్తున్న వ్యక్తిని రోడ్డు ప్రమాదం బలిగొంది. ఈ విషాదకర ఘటన కామారెడ్డి జిల్లా జుక్కల్ మండలం పడంపల్లి శివారులో చోటుచేసుకొంది. జుక్కల్ ఎస్సై భువనేశ్వర్‌రావు, గ్రామస్థుల కథనం ప్రకారం.. పెద్దఏడ్గికి చెందిన కుమ్మరి సాయిలు(42) నాగల్‌గావ్‌లో ఉంటున్న తన చెల్లెలు గంగామణి అలియాస్ సావిత్రి కుమార్తె ఆరోగ్యం బాగాలేకపోవడంతో ఆసుపత్రికి తీసుకెళ్లేందుకు పడంపల్లి మీదుగా శనివారం ద్విచక్రవాహనంపై బయలుదేరారు. దారి ఇరుకుగా ఉండి మూలమలుపులు ఎక్కువగా ఉన్నాయి. రోడ్డు పక్కన ముళ్లపొదల కారణంగా ఎదురుగా అతివేగంగా వస్తున్న మరో ద్విచక్రవాహనం కనిపించకపోవడంతో ఎదురెదురుగా ఢీకొన్నారు. కుమ్మరి సాయిలు తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే చనిపోయారు. మరో వాహనదారుడు గాయపడ్డారు. సాయిలుకు ఇద్దరు కుమారులున్నారు. ఆయన కొత్త ఇంటి నిర్మాణం చేపడుతున్నారు. మరో నెల రోజుల్లో గృహప్రవేశం ఉంది. అంతలోనే మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు కన్నీరుమున్నీరవుతున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.


సాయిలు

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

బాన్సువాడ 83284 29129

కామారెడ్డి 93970 82242



●●● జిల్లా కేంద్రం లోని గొల్లవాడలో చెత్త, ఇతర వ్యర్థాలు పేరుకుపోయాయి. - **రాహుల్, స్థానికుడు**

●●● సమస్య పరిష్కారానికి కృషి చేశాం. **- పర్వేజ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

●●● పట్టణంలోని మొదటి వార్డులో పలు చోట్ల మురుగు కాల్వలు నిండి దుర్గంధం వెదజల్లుతుంది. **- రవి, బాన్సువాడ**



●●● ఈ విషయాన్ని పారిశుద్ధ్య పర్యవేక్షకుడు సతీష్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన సిబ్బందితో పారిశుద్ధ్య పనులు చేయించారు.

●●● ఉప్పల్‌వాయిలో మిషన్ భగీరథ నీరు అరకొరగా వస్తుంది. **రాజు, గ్రామస్థుడు**

●●● సమస్య పరిష్కరిస్తాం. **-వంశీ, ఏఈ**

పరిష్కారం: పోచారం పంచాయతీ పరిధి లోని ధర్మపురి తండాలో కొద్ది రోజులుగా మురికి కాలువల నుంచి వ్యర్థాలు తొలగించలేదు. విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో శనివారం వ్యర్థాలు తొలగింపజేశారు.



●●● సిద్దాపూర్ తండాలో విద్యుత్తు నియంత్రిక చేతికందే ఎత్తులో రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉంది. **-దేవిసింగ్, స్థానికుడు**

●●● పరిశీలించి చర్యలు చేపడుతాం. **బుజ్జి బాబు, విద్యుత్తు శాఖ ఏఈ, పిట్లం**

- న్యూస్‌టుడే, కామారెడ్డి పట్టణం,పిట్లం, బాన్సువాడ పట్టణం, పెద్దకొడప్‌గల్, రామారెడ్డి

ప్రణాళికతో బోధించాలి

భిక్కనూరు, న్యూస్‌టుడే: ట్రిపుల్ ఐటీలో సీటు సాధించేలా విద్యార్థులకు ప్రణాళికాబద్ధంగా విద్యా బోధన జరగాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సూచించారు. శనివారం భిక్కనూరు మండలం జంగంపల్లి శివారులోని కేజీబీవీ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. భోజన, వసతి సౌకర్యాలు, విద్య తదితర అంశాలను ప్రత్యేక అధికారి హరిప్రియను అడిగి తెలుసుకున్నారు. ఆర్డీవో రంగనాథ్‌రావు, జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారిణి రజిత, డీఈవో రాజు తదితరులు ఉన్నారు



విద్యార్థినిలతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

చదువు భవిష్యత్తును మారుస్తుంది

బీర్కూర్, బిచ్కుంద న్యూస్‌టుడే: చదువు భవిష్యత్తును మారుస్తుందని సబ్‌కలెక్టర్ కిరణ్మయి అన్నారు. బీర్కూర్ ఉన్నత పాఠశాలను శనివారం ఆమె తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల హాజరు పట్టిక పరిశీలించారు. విద్యార్థులతో కలిసి ప్రార్థనలో పాల్గొన్నారు. విద్యార్థులతో మాట్లాడారు. భోజనం అమలు తీరు, నిత్యావసర సరకులపై ఉన్న గడువు తేదీలను చూశారు. మరుగుదొడ్ల దుర్వాసన రావడంతో అసహనం వ్యక్తం చేశారు. తహసీల్దార్ లత, ఎంఈవో వెంకన్న తదితరులు ఉన్నారు. అనంతరం బిచ్కుంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఆమె సందర్శించారు.



బీర్కూర్ ఉన్నత పాఠశాల ప్రార్థనలో పాల్గొన్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

'తరుగు తీయని మిల్లులకు ధాన్యం కేటాయించండి'

బీర్కూర్, న్యూస్‌టుడే: తరుగు తీయని మిల్లులకు ధాన్యం కేటాయించేలా చూడాలని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డికి బీర్కూర్, బరంగెడ్గి, భైరాపూర్, కిష్టాపూర్, తిమ్మాపూర్ రైతులు విన్నవించారు. తెలంగాణ తిరుమల దేవస్థానానికి శనివారం ఎమ్మెల్యే వచ్చి శ్రీవారికి అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. ఈ మేరకు ఆయనను రైతులు కలిశారు. బీర్కూర్‌లో అధిక తరుగు తీస్తున్న మిల్లులకు తమ ధాన్యాన్ని ఇవ్వొద్దని, మిల్లర్లు తరుగు తీయడంతో తాము ప్రతి సీజన్లో నష్టపోతున్నామని వాపోయారు. అనంతరం ఆలయాభివృద్ధి పనులపై కమిటీ సభ్యులతో సమావేశమై చర్చించారు. మైలారం సొసైటీ ఛైర్మన్ హన్మంతురావు, సాయిబాబా, నర్సరాజు, శశికాంత్ తదితరులు పాల్గొన్నారు.



కామారెడ్డిలో విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో



ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో

భగత్‌సింగ్ ఆశయ సాధనకు కృషి

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: భగత్‌సింగ్ ఆశయ సాధనకు యువత కృషి చేయాలని వక్తలు అభిప్రాయపడ్డారు. కామారెడ్డి జిల్లాకేంద్రంలో శనివారం భగత్‌సింగ్ జయంతిని నిర్వహించారు. దేవునిపల్లిలో, కామారెడ్డిలోని సుభాశ్‌రోడ్డులో మహనీయుడి విగ్రహాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. విశ్వహిందూపరిషత్, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.

పరిసరాలు శుభ్రం

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: స్వచ్ఛతకు సమష్టి కృషి అవసరమని పురపాలక ఛైర్‌పర్సన్ ఇందుప్రియ అన్నారు. జిల్లాకేంద్రంలో శనివారం స్వచ్ఛతా హీ సేవాలో భాగంగా ప్రజా శౌచాలయాల్లో సామూహిక శుభ్రతా చర్యలు చేపట్టారు. కమిషనర్ సుజాత, కౌన్సిలర్లు చాట్ల రాజేశ్వర్, పాత శివకృష్ణ ఉన్నారు



చెత్త ఊడుస్తున్న పురపాలక ఛైర్‌పర్సన్ ఇందుప్రియ

గుర్రం జాషువా జయంతి

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం గుర్రం జాషువా జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆధునిక సమాజానికి కొత్త వెలుగులు నింపిన కవి జాషువా అని ప్రిన్సిపల్ విజయ్‌కుమార్ కొనియాడారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ కిష్టయ్య, తెలుగు విభాగాధిపతి విశ్వప్రసాద్, అధ్యాపకులు రవి, మల్లేశ్, లక్ష్మణాచారి, శ్రీనివాస్ తదితరులున్నారు.



కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీకళాశాలలో నివాళులర్పిస్తున్న ప్రిన్సిపల్ విజయ్

భోజనంలో పురుగు

నిజాంసాగర్, మహ్మద్‌నగర్, న్యూస్‌టుడే: నిజాంసాగర్ మండల కేంద్రంలోని నవోదయ విద్యాలయంలో మధ్యాహ్న భోజనంలో పురుగు వచ్చిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఈ నెల 22న భోజనం చేసే సమయంలో ఓ విద్యార్థికి భోజనంలో పురుగు కనిపించడంతో ఉపాధ్యాయులకు తెలిపారు. ఎవరికీ చెప్పొద్దని ఉపాధ్యాయులు మందలించడంతో విషయం బయటకు రాలేదు. ఈ విషయమై పాఠశాల ప్రిన్సిపల్ సత్యవతిని న్యూస్‌టుడే వివరణ కోరగా.. కొన్ని రోజులుగా అనారోగ్యంతో సెలవులో ఉన్నానని భోజనంలో పురుగు వచ్చిన ఘటన వాస్తవమేనని చెప్పారు. దీనిపై విచారణ చేపడుతున్నట్లు వివరించారు.

పోరాటయోధులను గౌరవిద్దాం

నిజాంసాగర్, మహ్మద్‌నగర్, పిట్లం న్యూస్‌టుడే: కాంగ్రెస్ హయాంలోనే పోరాటయోధులకు గౌరవం దక్కిందని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు అన్నారు. నిజాంసాగర్ మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ విగ్రహాన్ని శనివారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. మల్లికార్జున్, రవీందర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు జయప్రదీప్, ఆకాష్, గంగారాం తదితరులు ఉన్నారు. అనంతరం ఎస్సీ కార్పొరేషన్ సౌజన్యంతో ఎస్సీ నిరుద్యోగ మహిళలకు ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయగా కేంద్రాన్ని పిట్లం మండల కేంద్రంలో ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు, సబ్ కలెక్టర్ కిరణ్మయితో కలిసి ప్రారంభించారు. తహసీల్దార్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు

సమస్యల పరిష్కారంలో టీఎన్జీవోస్ ముందంజ

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో టీఎన్జీవోస్ ముందంజలో ఉందని జిల్లా అధ్యక్షుడు ఎన్. వెంకట్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో శనివారం గ్రామీణాభివృద్ధి సంస్థ ఉద్యోగుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఏ సమస్య ఉన్న తమ యూనియన్ దృష్టికి తేవాలన్నారు. జిల్లా ప్రతినిధులు దేవరాజు, లక్ష్మణ్, పోచయ్య, శివకుమార్, గ్రామీణాభివృద్ధి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు ఎన్.వెంకట్‌రెడ్డి

గ్రంథాలయానికి పుస్తకాల అందజేత

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల గ్రంథాలయానికి బీన్‌రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం పుస్తకాలు అందజేశారు. విద్యార్థులు పోటీ పరీక్షల కోసం చదువుకోవడానికి అవసరమైన పుస్తకాలను సమకూర్చారని ప్రిన్సిపల్ విజయ్‌కుమార్ అన్నారు. ప్రతినిధులు డీఎన్‌రావు, రాజ్‌గంబీర్ రావు, డా. కిష్టయ్య, లక్ష్మణాచారి, శ్రీనివాసరావు, జయప్రకాశ్ తదితరులున్నారు.

సభ్యత్వాల స్వీకరణ

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలోని వివిధ కేజీబీవీల్లో టీపీఆర్టీయూ ఆధ్వర్యంలో శనివారం సభ్యత్వాలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు అంబీర్ మనోహర్ రావు మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. జిల్లా ప్రధానకార్యదర్శి లక్ష్మీరాజం, ప్రతినిధులు సంతోశ్‌రెడ్డి, చంద్రశేఖర్, మొయినొద్దీన్ తదితరులున్నారు.

భక్తితో మానసిక ప్రశాంతత



ఉప పీఠానికి వస్తున్న స్వామి శ్రీనరేంద్ర చార్యజీ

జుక్కల్, న్యూస్‌టుడే: అనంత్ శ్రీవిభూషిత్ జగద్గురు రామానంద చార్య దక్షిణ భారత్ పీఠాధిపతి స్వామి శ్రీనరేంద్ర చార్యజీ మహరాజ్ దర్శనానికి వచ్చిన భక్తులతో తెలంగాణ ఉప పీఠం కిక్కిరిసింది. స్వామీజి 'సమస్యా- మార్గదర్శనం, సాధక్ దీక్ష' కార్యక్రమాలతో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. బంగారుపల్లి- దోస్త్‌పల్లి శివారులోని ఉపపీఠానికి తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలొచ్చారు. భక్తితోనే మానసిక ప్రశాంతత సాధ్యమని స్వామి వారు ఉపదేశించారు.

బిచ్కుంద, న్యూస్‌టుడే: ప్రతి వ్యక్తి భక్తిమార్గంలో నడవాలని తోగుట పీఠాధిపతి మాధవానంద సరస్వతి పేర్కొన్నారు. శనివారం బిచ్కుంద మండల కేంద్రంలో శ్రీధర్ కులకర్ణి ఆధ్వర్యంలో పాద పూజ నిర్వహించారు.

బాన్సువాడ పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని పెద్ద హనుమాన్ ఆలయం, పాత బాన్సువాడ హనుమాన్ మందిరాల్లో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

పాఠశాలకు బెంచీల వితరణ

కామారెడ్డి గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాకు చెందిన శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డి క్యాసంపల్లితండా ప్రభుత్వ పాఠశాలకు రూ. 50 వేల విలువైన బెంచీలను వితరణ చేశారు. పీవైఆర్ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో క్యాసంపల్లి పాఠశాలకు రూ.50 వేల నగదు విరాళంగా అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. తాను ప్రభుత్వ పాఠశాల విద్యార్థినేనని.. సర్కారు బడుల్లో చదివే విద్యార్థులకు తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. మాజీ ప్రజాప్రతినిధులు అంజయ్య, రాజుదాసు, ప్రధానోపాధ్యాయులు సిద్ధిరాంరెడ్డి, నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో దాత పైడి ఎల్లారెడ్డి

లైసెన్స్ పత్రాల అందజేత

కామారెడ్డి కలెక్టరేట్: జిల్లాలో నూతన రేషన్ డీలర్లుగా ఎంపికైన వారికి శనివారం లైసెన్స్ పత్రాలు అందజేశారు. ఆయా ఆర్డీవో కార్యాలయాల అధికారులు డీలర్లకు పత్రాలు పంపిణీ చేశారు. ఇదివరకే నియామక పత్రాలు అందుకున్న డీలర్లు తాజాగా లైసెన్స్ పత్రాలు తీసుకున్నారు. వీరి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసిన తర్వాత రేషన్ కోటా కేటాయించనున్నారు.

సీఐకి సన్మానం

బాన్సువాడ పట్టణం, న్యూస్‌టుడే: పట్టణ సీఐగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన సీఐ అశోక్‌ను శనివారం విద్యార్థి సంఘాల నాయకులు కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం జిల్లా ప్రతినిధి నిఖిల్‌గౌడ్, లంబాడీ స్టూడెంట్ ఆర్గనైజేషన్ జిల్లాధ్యక్షుడు రాథోడ్ జీవన్ నాయక్, దత్తు ఉన్నారు.

విద్యార్థి కుటుంబానికి ఆర్థిక సాయం

పల్వంచ(మాచారెడ్డి), న్యూస్‌టుడే: పల్వంచ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల 8వ తరగతి విద్యార్థి విజయ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబానికి పాఠశాల ఉపాధ్యాయ బృందం రూ.20 వేలు, గ్రామస్థులు రూ.10 వేలు అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోవర్ధన్ రెడ్డి, మాజీ ఉపసర్పంచి జితేందర్ రెడ్డి, బాల్‌రాజు, శేఖర్, నారాగౌడ్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

వైద్య శిబిరం పరిశీలన

జుక్కల్, న్యూస్‌టుడే: పంచాయతీ కార్మికుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు డిప్యూటీ డీఎంహెచ్‌వో డా.విద్య అన్నారు. జుక్కల్ ఆస్పత్రిలో శనివారం స్వచ్ఛతా హీ సేవాలో భాగంగా 'సఫాయి మిత్రులు' పేరిట పంచాయతీ కార్మికులకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో రాము పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: శ్రీసాయి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం అనాథ బాలికల గృహంలో దుస్తులు, పాదరక్షల వితరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి హాజరై మాట్లాడారు. పిల్లలు ఉన్నత చదువులు చదివి గొప్పగా ఎదగాలన్నారు. దాత గంగాధర్‌గౌడ్, ప్రతినిధులు చక్రవర్తిగౌడ్, రమణ, భగత్, డీడబ్ల్యూవో బావయ్య తదితరులున్నారు.

మంచి అలవాట్లు అలవర్చుకోవాలి

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: వయోవృద్ధులు ఆరోగ్యకరమైన అలవాట్లు కలిగి ఉండాలని ఆర్డీవో రంగనాథరావు పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలో వయోవృద్ధులు శనివారం నిర్వహించిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. డీడబ్ల్యూవో బావయ్య, సీనియర్ సిటిజన్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు పున్న రాజేశ్వర్ పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ప్రతినిధులు

సంఘం అభివృద్ధికి కృషి చేయాలి

గాంధారి, బాన్సువాడ, తాడ్వాయి, న్యూస్‌టుడే: రైతులు తీసుకున్న పంట రుణ అప్పులు సకాలంలో చెల్లించి సొసైటీ అభివృద్ధికి కృషి చేయాలని గాంధారి సొసైటీ ఛైర్మన్ సాయికుమార్ అన్నారు. మండల కేంద్రంలోని గాంధారి సింగిల్ విండో కార్యాలయంలో ఆయన అధ్యక్షతన శనివారం 'మహాజన సభ' నిర్వహించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు నిబంధనలు లేకుండా రూ.2లక్షల రుణమాఫీ చేయాలని బాన్సువాడ సర్వసభ్య సమావేశంలో తీర్మానించారు. సహకార సంఘం ఛైర్మన్ కృష్ణారెడ్డి అధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తాడ్వాయి ప్రాథమిక వ్యవసాయ సంఘం అధ్యక్షుడు కపిల్‌రెడ్డి ఆధ్వర్యంలో విండో ఆవరణలో మహాజన సభ ఏర్పాటు చేశారు. పలు తీర్మాణాలు చేశారు. విండో పరిధిలో సగం మందికి రుణమాఫీ కాలేదన్నారు.

విద్యార్థుల ప్రతిభ

పిట్లం, న్యూస్‌టుడే: జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ ఖోఖో టోర్నమెంట్‌లో పిట్లం విద్యార్థులు సత్తా చాటారని సీఆర్పీ హైమద్ పాషా శనివారం తెలిపారు. అండర్ 17 బాలికల విభాగంలో పిట్లం జోన్ ప్రథమ స్థానం, అండర్ 14 బాలుర విభాగంలో ద్వితీయ స్థానం సాధించినట్లు చెప్పారు. ఎస్‌జీఎఫ్ జనరల్ సెక్రటరీ హీరాలాల్, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఖోఖో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ అతికుల్ల క్రీడాకారులను అభినందించినట్లు పేర్కొన్నారు.



విద్యార్థులతో వ్యాయామ ఉపాధ్యాయులు

గాంధారి, న్యూస్‌టుడే: అంతర్ పాఠశాల క్రీడల పోటీల్లో ఛాంపియన్‌షిప్‌గా పేట్‌సంగెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు నిలిచినట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు లక్ష్మణ్ రాథోడ్ తెలిపారు. ఈ నెల 26 నుంచి 27 వరకు జరిగిన మండల స్థాయి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చినట్లు పేర్కొన్నారు.

కేసుల పరిష్కారానికే లోక్ అదాలత్

ఎల్లారెడ్డి, న్యూస్‌టుడే: కక్షిదారులకు కాలయాపన లేకుండా త్వరితగతిన కేసుల పరిష్కారానికి జాతీయ లోక్ అదాలత్ వేదికగా ఉపయోగపడుతుందని ఎల్లారెడ్డి మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి హారిక అన్నారు. ఎల్లారెడ్డి కోర్టులో శనివారం లోక్‌అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. పలువురు కేసుల పరిష్కారానికి దరఖాస్తులు తీసుకున్నారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు, న్యాయవాదులు నవీన్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు తహసీల్దారు కేటాయింపు

కామారెడ్డి కలెక్టరేట్, న్యూస్‌టుడే: పదోన్నతిపై జిల్లాకు తహసీల్దారుగా గిరిబాబును కేటాయిస్తూ సర్కారు శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన మహబూబాబాద్ జిల్లాలో ఉప తహసీల్దారుగా విధులు నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా పదోన్నతులు ఇచ్చి బదిలీ అయిన ముగ్గురిలో ఈయన ఒకరు.

సేవలు అభినందనీయం

జుక్కల్, న్యూస్‌టుడే: పదేళ్ల పాటు కస్తూర్బాలో విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న ప్రత్యేకాధికారి అశ్విని సేవలు అభినందనీయమని డీఈవో రాజు కొనియాడారు. శనివారం జుక్కల్ కస్తూర్బా విద్యాలయంలో ఆమెను ఘనంగా సన్మానించారు. జీఈసీవో సుకన్య, ఎంఈవో తిరుపతయ్య తదితరులు ఉన్నారు.

రికార్డుల తనిఖీ

జుక్కల్: ప్రజలకు చట్టాలు, హక్కులపై అవగాహన కల్పించేందుకే పంచాయతీ రికార్డులు తనిఖీ చేసేందుకు సహచట్టం ద్వారా అనుమతి కోరామని, కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ కమిటీ సభ్యుడు శివచంద్ర అన్నారు. తనిఖీకి అనుమతి లభించడంతో శనివారం నాగల్‌గావ్ పంచాయతీకి సంబంధించిన 2013 నుంచి నేటి వరకు అన్ని రికార్డులు వారు పరిశీలించామని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు, రికార్డుల పరిశీలనపై కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ అవగాహన కార్యక్రమాలు చేపడుతోందన్నారు. సభ్యులు రత్నాకర్, అశోక్, శ్రీనివాస్ ఉన్నారు

అవీ...ఇవీ.. అన్నీ

సభ్యత్వ నమోదు

లింగంపేట, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో శనివారం భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించినట్లు పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాణాల లక్ష్మారెడ్డి పాల్గొన్నట్లు వివరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్‌రావు, జిల్లా ఉపాధ్యక్షుడు విఠల్, నాయకులు దత్తురాం, రజినికాంత్, మురళి తదితరులు ఉన్నారు.

దోమకొండలో వైద్య శిబిరం

దోమకొండ, న్యూస్‌టుడే: దోమకొండలోని గడీ కోట ట్రస్టు, శ్రీరామ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఆనంద్ భవన్‌లో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. గైనిక్, ఆర్థోపెడిక్ సమస్యలపై వైద్యులు రవళి, రాకేశ్ పరీక్షలు చేశారు. మాజీ జడ్పీటీసీ సభ్యుడు తిర్మల్ గౌడ్, నాయకులు శంకర్‌రెడ్డి, మధుసూదన్, గడీ కోట ట్రస్టు సీనియర్ మేనేజర్ బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

నిజాంసాగర్‌ను సందర్శించిన ఎంపీ

నిజాంసాగర్: నిజాంసాగర్ జలాశయం నిండుకుండలా మారడం సంతోషంగా ఉందని జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ అన్నారు. శనివారం ఆయన జలాశయాన్ని సందర్శించారు. సాగర్ ఆయకట్టు కింద 1.30 లక్షల ఎకరాల సాగుభూమి ఉందని, ప్రాజెక్టుకు జలకళ సంతరించుకోవడంతో రైతులు రెండో పంటకు సిద్ధం కావాలని తెలిపారు.

పరామర్శ

బాన్సువాడ పట్టణం, న్యూస్‌టుడే: స్వర్ణకార సంఘం సభ్యుడు రామాచారి, తన వ్యక్తిగత సహాయకుడు మల్లారెడ్డి తండ్రి సాయిరెడ్డిలు ఇటీవల మృతిచెందడంతో శనివారం రాత్రి వారి కుటుంబ సభ్యులను మాజీ డీసీసీబీ ఛైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి వేర్వేరుగా పరామర్శించి ఓదార్చారు. కార్యక్రమంలో బల్దియా ఛైర్మన్ జంగం గంగాధర్, ఎజాజ్, ఉదయ్, రాచప్ప తదితరులు పాల్గొన్నారు.

టాస్క్‌ఫోర్స్ అధికారుల దాడులు!

ఎల్లారెడ్డి, న్యూస్‌టుడే: ఎల్లారెడ్డి మండలం తిమ్మాపూర్‌లో టాస్క్‌ఫోర్సు అధికారులు శనివారం తనిఖీలు చేసి అల్ప్రాజోలం, గంజాయి, డైసోఫాం అక్రమ రవాణా చేస్తున్న ఒకరిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. నిందితుడి నుంచి వాటిని స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. విషయాన్ని అధికారులు గోప్యంగా ఉంచుతున్నారు.

పంచాయతీ ఆస్తుల విషయంపై వాగ్వాదం

నస్రుల్లాబాద్, న్యూస్‌టుడే: జాతీయ రహదారి 765డి రోడ్డు విస్తరణలో భాగంగా గ్రామ కంఠం పరిధిలోని పంచాయతీ ఆస్తుల విషయంపై శనివారం అంకోల్‌క్యాంపులో జాతీయ రహదారి అధికారులు, ప్రజల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీలత, ప్రజలు కలిసి పంచాయతీ ఆస్తుల నష్టంపై పరిహారం లేదా, ప్రత్యామ్నాయం చూపాలని కోరుతూ రోడ్డు పనుల ప్రాజెక్టు మేనేజర్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ విషయంపై జాతీయ రహదారి 765డి ఏఈ శ్రీధర్ మాట్లాడేందుకు అంకోల్ క్యాంపు గ్రామ పంచాయతీకి వచ్చారు. జాతీయ రహదారి సిద్దిపేట అధికారికి వినతిపత్రం రాయకుండా రోడ్డు పనులు చేసే ప్రాజెక్టు మేనేజర్‌కు రాయడం ఏంటి? అని ఏఈ శ్రీధర్ ప్రజలను ప్రశ్నించడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం మొదలైంది. తమను జాతీయ రహదారి అధికారులు బెదిరిస్తున్నరంటూ అంకోల్‌క్యాంపు మాజీ సర్పంచి రాము రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ విషయంపై జాతీయ రహదారి 765డి ఏఈ శ్రీధర్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. 'వినతిపత్రం రాసిన విషయం అడగడానికి గ్రామానికి వచ్చాం. తప్ప తాము ఎవరిని బెదిరించలేదన్నారు

విండో మహాజన సభలో..

బీర్కూర్: బైరాపూర్ సొసైటీ ఇన్‌ఛార్జి ఛైర్మన్ శ్యామ్ అధ్యక్షతన శనివారం నిర్వహించిన విండో మహాజన సభలో వాగ్వాదం జరిగింది. జమ ఖర్చులను సొసైటీ సీఈవో భూమయ్య చదివి వినిపించారు. 5 నెలల జమ ఖర్చు లెక్కల్లో తేడా వచ్చిందంటూ రైతులు సహకార సిబ్బందిని నిలదీశారు. ఇటీవల మరణించిన మాజీ ఛైర్మన్ రామకృష్ణ రూ.5.19 లక్షలు, సేల్స్‌మెన్ విలాష్ రూ.లక్ష, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు స్వరూప భర్త శ్రీనివాస్ రూ.43 వేలు, డైరెక్టర్ బలారాంసింగ్ రూ.20 వేలు మొత్తం రూ.6.62 లక్షలు సొంతానికి వాడుకున్నట్లు సభలో సీఈవో చెప్పారు.

కాలువలో పడి ఒకరి మృతి



సంజీవులు

మహ్మద్‌నగర్, నిజాంసాగర్, న్యూస్‌టుడే: మద్యంతాగి తిరుగుతున్న వ్యక్తి ప్రమాదవశాత్తు మిషన్ భగీరథ నీటి కాలువలో పడి మృతి చెందిన ఘటన మహ్మద్‌నగర్ మండలంలోని కోమలంచ గేటు సమీపంలో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు, ఏఎస్సై రాజేశ్వర్ కథనం ప్రకారం.. మండలంలోని తుంకిపల్లికి చెందిన మెట్టు సంజీవులు(56) భార్య విమల 25 ఏళ్లుగా కుమార్తెతో కలిసి హైదరాబాద్‌లో ఉంటున్నారు. సంజీవులు ఒంటరిగా గ్రామంలోనే జీవిస్తున్నాడు. మద్యానికి బానిసై రెండు రోజులుగా గాలీపూర్ అటవీ ప్రాంతంలో తిరుగుతుండగా కోమలంచ గేటు సమీపంలోని బాన్సువాడ- నిజాంసాగర్ ప్రధాన రహదారి వద్ద మిషన్ భగీరథ ఎయిర్ వాల్ సమీపంలోని కాలువలో ప్రమాదవశాత్తు పడిపోయాడు. శవపరీక్ష నిమిత్తం బాన్సువాడ ఆసుపత్రికి తరలించామని, సోదరుడు లచ్చయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు.

కుంటలో మునిగి...

కామారెడ్డి నేరవిభాగం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రం శివారులోని గోసంగి కాలనీకి చెందిన కోదండం సారయ్య(45) రామేశ్వర్‌పల్లి పరిధిలోని కుంటలో చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు అందులో మునిగి మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిన సారయ్య శనివారం శవమై తేలాడు. ఈ విషయమై దేవునిపల్లి ఎస్సై రాజును 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. తమకు ఫిర్యాదు అందలేదన్నారు.

వివాహిత అదృశ్యం

బిచ్కుంద, న్యూస్‌టుడే: బిచ్కుంద మండలం శాంతాపూర్‌కు చెందిన భూమవ్వ (63) అదృశ్యమైనట్లు ఎస్సై మోహన్‌రెడ్డి తెలిపారు. భూమవ్వ ఈనెల 14న చిన్నతక్కడ్‌పల్లిలో కుండలు అమ్ముకొస్తానని వెళ్లి తిరిగి రాకపోవడంతో భర్త మారుతి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

బూజుపట్టిన మిఠాయిల విక్రయంపై ఫిర్యాదు

బీర్కూర్, న్యూస్‌టుడే: బీర్కూర్‌లోని ఓ మిఠాయి దుకాణంలో బూజు పట్టిన మిఠాయిలు విక్రయిస్తున్నారని పేర్కొంటూ తహసీల్దార్ లత, బాన్సువాడ సబ్‌కలెక్టర్ కిరణ్మయికి యువకులు శనివారం ఫిర్యాదు చేశారు. ఆ దుకాణంలో కొనుగోలు చేసిన మిఠాయిలు వాసన వస్తున్నాయని, దుకాణాదారుడిని అడిగితే నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ దుకాణంపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

ఏకరూప దుస్తులు వచ్చేశాయ్

జుక్కల్, న్యూస్‌టుడే: బస్వాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు ఏకరూప దుస్తులు ఇవ్వకపోవడంపై ఈ నెల 24న 'ఏకరూప దుస్తులు ఇప్పించరూ..!' శీర్షికన ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. శనివారం హెచ్ఎం జయచంద్ విద్యార్థులకు ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు.



దుస్తులు అందజేస్తున్న హెచ్ఎం జయచంద్